

# రొద

సరోజ అనే యవ్వని సైన్సు టెక్స్టు తిరగేస్తున్నది. రివైజ్ చేస్తున్నది.

సహాధ్యాయినులు కాశీరత్నం గంగారత్నం వచ్చి చాపమీద కూచున్నారు.

"బాగా చదువుతున్నట్టున్నావే సరోజా! ప్రిపరేషన్ హాలిడేస్ వృథా కాకుండా ప్రిపేరౌతున్నావా? ఫస్ట్ రాంక్ కొడ్తావా? ష్యూర్. రిసెర్చ్ చేయాలనుందా? జాబ్ కొడ్తావా? అదీ ష్యూరే. మీ అమ్మ యేమంటుందీ? చదివిన చదువు చాల్లే పెళ్లాడు అంటుందా!" అని నవ్వింది కాశీరత్నం.

సరోజ టెక్స్ట్ అవతలుంచి ప్రొసీజర్ వ్రాసిన రికార్డ్ బుక్ అందుకుని పేజీలు తిరగేస్తున్నది. గంగారత్నమూ చూసిందా పుస్తకాలలోకి. "నీకేమోయ్ నీ రికార్డ్ బుక్‌లో మేడమ్ కోమలవల్లి, ప్రొఫెసర్ అండ్ ప్రిన్సిపాల్, మంచి రిమార్క్ గుడ్ అని వ్రాసింది. అది రికమెండేషనే. హాండ్ రైటింగ్ చూసి దానిమీద ఫెయిర్ అని వ్రాసింది. లెక్చరర్ శంకరీబాయ్, సిస్టర్సూ నువ్వు థియరీ బాగా వ్రాస్తావంటారు. మీ అమ్మగారేం చేస్తున్నారూ? ఇల్లు నిశ్శబ్దంగా వున్నదే! ఈ పాటికి తినటానికేమైనా తెచ్చి ముందుంచి, 'తినండి అమ్మాయిలూ! చదువు వేడిచేస్తుంది' అనాలే" అన్నది.

"వీళ్లిద్దరూ నన్ను ప్రిపేర్ కానివ్వరు. జెలసీ. నన్ను తప్పించటమెలాగా అని పథకం వేసి వస్తారు" అనుకున్నది నరుసు. వాళ్లని రావద్దనలేదు. త్వరగా పంపేయనూ లేదు.

"మా అమ్మా! నీకు తెలియదూ రత్నం? పుస్తకం తెరవంగానే పక్కన జేరి పెద్ద రొదపెడుతూ చదువుకో నివ్వదు. మలేరియా యెటాక్ చేస్తుందామెని. దాని తీవ్రతకు తట్టుకోలేక, తలకు వాసిన కట్టి, కూచుని రొద పెడుతుంది. ఫస్ట్

రాంకా? ఫస్ట్ క్లాసా. అప్పట్నున్నా చూస్తే. పరీక్షకు అప్పియర్ కాకపోతేనే మంచిదేమో. పరీక్ష ఫీజు దండగ అవుతుందేమో.'' విసుగు పైకిరాకుండా జాగర్త పడింది. విచారంగా చూసింది నరుసు.

''యేమని రొదపెడుతుందీ? చదువుకోనివ్వు పరీక్ష వ్రాయాలి. అనలేవూ?'' కాశీరత్నం అడిగింది.

''యెందుకననూ! జ్వరతీవ్రత మీద వినదు. నేనే లేచిపోయి వేరే చోట కూచున్నా అక్కడికీ వస్తుంది. కొంత మంది ఫ్రస్ట్రేషన్ రొదపెడుతుంటే పోతుంది.''

''ఫ్రస్ట్రేషన్ యెందుకొస్తుందీ?'' గంగారత్నం అడిగింది.

'పెళ్లి కుదరలేదని, పెళ్లి కాదేమోనని వస్తుంది.''

'' ఓహో! రొదపెడితే ఫ్రస్ట్రేషన్ యెలా తగ్గుతుందీ? యేమని రొదపెడుతుందీ? యెవరినో ఒకరిని చేసేసుకోమంటుందా?'' అనడిగింది కాశీరత్నం.

''అహో హా! అలా అనదు. తను మెచ్చిన వాడినే చేసుకోవాలి. వాడంతట వాడే రావాలి. వాడు పెళ్లి వూసెత్తడనుకో, వాడినేమీ అనదు. ప్రేక్షకురాలిలాగ వుంటుంది. నేనులోకువౌతాను. వాడందడు. అందుబాటులో వుండేది నేనూ. ఐయామ్ హేండీ. టెంపరేచర్ నార్మల్ కొచ్చేదాకా రొదపెడుతుంది. మలేరియా జ్వరానికదాక మందు కనిబెట్టింది. వాడితో పోతున్నావు వాడి కేమీ లేదు. జీడిగింజలంటి వాళ్లవాళ్లు వాడిని వదలరు. నీ మొహానేమీ పెట్టడు. వేస్తే ముష్టివేస్తాడేమో. బంగారు తూగుటుయ్యాల్లో పెట్టి వూపుతాడని ఆశలు పెంచుకుంటున్నావేమో. అదేమీ వుండదు. వాడు చేయి జాపగానే అందావు అదీ వాడి ధీమా. ఇంక నిన్ను చేయిజారి పోనీయడు. వాళ్లవాళ్లు వాడిమీద నిఘా

వుంచారు. పట్టుబడకుండా వుండగల జిత్తులు తెలుసువాడికి. యేమంటాడూ? తానింతవరకు ఆడదాన్ని యెరగనంటాడా? సంపాయించి నీ బొందమీద పోస్తానంటాడా? నట్టేట్లో ముంచుతాడు. ఉభయ భ్రష్టువౌతావేమో! తర్వాత నన్ను దూషించేవు. నేను నీ కేమీ చేయలేను. రావద్దని ఖరాఖండిగా చెప్పలేవా? చిన్న పాపవా? మోసపోయిన వాళ్లను చూడటంలేదా? సినిమాలు చూపిస్తున్నాడుగా. అర్ధరాత్రి తప్పితే పగలు ఆడే సినిమాలు లేవా? టిక్కెట్లు దొరకవా? వాళ్లవాళ్లకు మస్కా వేసి వస్తున్నాడు. పబ్లిగ్గానే రమ్మను. దొంగ నవ్వూ, బెదురుచూపులూ వాడూ యేమంటాడు నీతో, 'ప్రాణేశ్వరీ! హా! నిన్నిడిచినే నుండగలనా? నీ యీ దాసుని కోరిక తీర్చూ. అంటాడా?' అని రొద. ఆ రొద వినలేక వేరే గదిలోకి పోయి తలుపేసుకోవాలి. తలుపవతల్నించి రొద వినబడుతూనే వుంటుంది. ఆ పూట పస్తుండాలి. మర్నాడన్నం తిన్నంతసేపూ రొదే. తల పట్టి పోతుంది'' నరుసు మరొక నోట్‌బుక్ అందుకున్నది.

వినే వారిద్దరికీ రొదరంజుగా వున్నది. మరికొన్ని వివరాలు బయటికి లాగాలి.

''లవ్వర్‌మాన్ యేమంటాడు నరుసూ? నీవు వాడితో మొత్తుకోవూ?'' అనడిగారు చిరునవ్వు చిందిస్తూ.

''లవ్వరూ జోరీగలాగా రొదపెడతాడోయీ. చెవులో యిల్లు కట్టుకుని మరీ పెడతాడు. ఆ రొద మా అమ్మ రొద కన్న యింపుగా వుంటుంది. ''నాకాడది కావాలంటే వేరే యెవరినీ చూసుకోలేనంటావా? చాతగాని వాడినంటావా? నాకు అందం డబ్బూ లేదంటావా?' అని రొదపెడుతూ, నలుగు పెట్టి, నలుగు రాచి పిండిరాల్చటం చేస్తాడు'' అని నరుసు అభినయిస్తుంటే వాళ్లూ నవ్వారు.

'' ఆ రొదకర్థమేమిటంటే, నన్నే యెన్నుకున్నాడనీ, నేనే కావాలంటున్నాడనీ నమ్మమంటాడు. కాని మా అమ్మ అన్నట్టు నేను పాపాయిని కాదుగా. అంతటితో రొద ఆగితే బాగుండు. జోరీగ గదా. ''నన్ను షీలా రాత్రికి రమ్మని ఇన్వైట్ చేసింది. నేను పోలేదు. దానికాశాభంగం కలిగించాను. సుశీలాకుమారి మారుతీ కారు తోలుకుంటూ వచ్చింది. సినిమాకు పోదాం రమ్మన్నది. నాకు తెలుసు అదెక్కడికి తీసికెళ్లుతుందో. వాణీ విక్టర్ నర్స్ ట్రయినింగ్ పూర్తి అయింది. నేను ఒంటరిగా అందగానే, 'రాత్రికి రమ్మన్నారా సురేష్ బాబూ!' అని కవ్విస్తుంది. నాకటువంటివి హాస్యంగా అన్నా యిష్టం లేదు. వినిపించుకోను. తల అడ్డంగా తిప్పాను. యెదిరించాలి. లోకాన్ని సంఘాన్ని సమాజాన్ని తనవారినీ యెదిరించాలి'' అని వున్మాదంలోకి వెళ్లి వాటేసుకుంటాడు. ''యేదీ మీరెవర్నీ యెదిరిస్తున్నట్టు ఋజువు కావటం లేదే. దొంగలాగా వస్తున్నారు. అంత ఖర్మమేమొచ్చిందీ! దొరలాగా రావచ్చునే. మంచి జాబ్ పేరూ ప్రతిష్ఠా వున్నాయి. మీ యింటి చుట్టూ తిరుగుతూ పిల్లనిస్తామనే వారున్నారు అంటిరి. నన్నే పట్టుకోటమెందుకు? వారిని చిన్నబుచ్చుటమెందుకు?'' అన్నానోయీ. కళ్లు తడిఅవుతుంటే కొంగుతో అద్దుకున్నది నరుసు.

''యేడుస్తున్నావా? యేడుపెందుకూ?'' కాశీరత్నం గద్దింపుగా అన్నది.

''యేడుపుగాదది. నవ్వలేక కన్నీళ్లొస్తాయి. అబద్ధాలతో మోసంతో కూడిన రొదవింటే నవ్వు వస్తుంది. డబ్బు సంపాదించటానికనేక మార్గాలున్నట్టే, పెద్దవాళ్లనెదిరించటంలో యిదొక మార్గం కనిబెట్టాడట జోరీగ. దీనివల్ల యెవరికీ నష్టము రాదట. హానీ వుండదట. సేఫ్టీ మార్గమట. 'చదువుకోవద్దా. రొద వినాలా?' అని నవ్వుదామనుకున్నాను. కాని లవ్వర్‌కి తోలు మందం''.

''అంతగా చదవక్కర్లేదు. చిక్కిపోతున్నావు. పెద్దజడ వేసుకునేదానివి.

జుట్టు వూడిపోయి జడ సన్నబడింది. కళ్లూ పళ్లూ అందం కోల్పోతున్నాయి. నీ రాంక్ సంగతి నేను చూడగలను. నేనేమీ చేతకానివాడిని గాదు. నా కోసం ఆడపిల్లలు తపిస్తున్నారు. మూర్ఛపోతున్నారు. నేను నీకు లోకువైనానా? నరుడు తానంత తావలచి వచ్చిన చుల్కనగాదె నారికిన్ ! నీకు మంచివుద్యోగం లభించగానే నీ దగ్గరే వుంటా. మనం వేరే వూరు వేయించుకుందాము. మావాళ్లను రానీను. సిగ్గులేకుండా వచ్చినా గెంటేస్తా. నా కంటె మంచి వరుడు వస్తాడటనా నీకూ? పెళ్లి అనే కార్యక్రమం కాగానే ట్రయల్స్ అండ్ ట్రిబ్యులేషన్స్ మొదలవుతాయి నీకు'. అని పారాణి పెట్టసాగాడు. 'మా అమ్మ పెట్టే రొద వినలేకుండా వున్నానండీ. చదువుకో నివ్వదు. మీరు నన్ను దర్శించటం ఆపేస్తే అందరి ప్రాణం సుఖానబడుతుంది' అన్నానోయీ. ఓటువేసిన రోజున వేలు మీద ఓ చుక్క పెడతారు. అది ఓ పట్టానపోదు. అలాగే వీడూనూ''.

''యేమని రొదపెడుతుంది మీ అమ్మ? నేను చెడ్డవాడినంటుందా? మా అమ్మ రొదపెట్టటంలో మీ అమ్మకు తీసిపోదు. ఆ రొద మరీ ఇన్‌డీసెంటుగా వుంటుంది.''

''దానితో తిరగవోకు. దానికి వర్ణబేధం గూడా లేదు. పిలిచిన వాడితో నల్లా తిరుగుతూ నలుగురి నోళ్లలో నానుతున్నది. దాని మేనత్త సంగతి నీ చెవిని బడలేదా? నిరంజని అని పేరుమార్చుకుని, నాటకాల రాయుడుతో నాటకాలు వేసి, చివరికి సినిమాలో దాసి వేషానికి కక్కుర్తిపడి నాటకాలరాయుడినీ వదిలి వెళ్లింది. నీవు మోజు పెంచుకున్న దాని పింతండ్రి ఫోర్జరీ చేసి బాంకు సొమ్ము యెనభైవేలు కాజేసి పారిపోయినాడు. పట్టుబడ్డాడనుకో. వాళ్లంతా సహపంక్తి భోజనం చేస్తారు. ఓషో యెవరో నాకు తెలియదు. ఆస్వామికి వీరు అనుయాయులుట. నీకన్న డబ్బున్నవాడందగానే నీకుద్వాసన జరుగుతుంది. నీకు మంచి సంబంధం కుదిర్చాము. పెళ్లి పేరెత్తని దాన్ని నమ్మకు'' అని రొద.

''మా అమ్మను యెదిరిస్తున్నాగా. నేను గొప్పవాడినే. నావంటి వాడు లేడు'' అంటుంటే పైత్యాన పడినట్టున్నాడనిపించి అల్లం పచ్చడి అన్నంతినిపించి నోరుమూయించగలిగాను. ఇంకేం ఫస్ట్‌క్లాస్ కాశీరత్నం? పరీక్షయెగ్గొట్టి పోవాల్సిందే'' అన్నది నరుసు.

''వాళ్లు చాలక మేముగూడా తోడైనట్టున్నామే నరుసూ! పోతాం. చదువుకో పాపం. పరీక్ష రాశాకే నువ్వన్న పనిచేయి'' అని లేచి వెళ్లిపోయారు రత్నాలిద్దరూ.

నరుసు నిట్టూర్చి లేచింది. తల్లికి జ్వరం జారినట్టున్నది. పిలుస్తున్నది. పండురసం తాగించాలి.